ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శుక్రవారం 4 అక్టోబరు 2024

క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే పూజలు



పాలకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

పాలకుర్తి, అక్టోబరు 3 : నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి దంపతులు చండీ హోమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక కల్యాణం కోసం మూడు రోజుల పాటు హోమం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలు, పాడి పంటలతో జీవించేందుకు హోమం ఉద్దేశమన్నారు. చండీహోమం నిర్వహించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, జల్గం కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, యాకాంతరావు, కమ్మగాని నాగయ్య తదితరులు ఉన్నారు.

మునిసిపాలిటీలకు మహర్దశ

పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా..

అన్ని మునిసిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్-2050

- వచ్చే యేడాది మార్చి నాటికి రూపకల్పన
- సీఎం సూచనలతో మునిసిపల్ అధికారులు కసరత్తు
- ప్రతిపాదనల రూపకల్పనకు ప్రణాళికలు
- 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో భాగం
- బ్లూ-గ్రీన్, గ్రీన్ మొబిలిటీ, గ్రీన్ ప్రాజెక్టులు సైతం అమలు
- ఇక వరంగల్ మాస్టర్‌ప్లాన్ 2040కి కాలం చెల్లినట్టే!





హనుమకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా..' నినాదంతో అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న వినూత్న కార్యక్రమం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యుఎంసీ)తో పాటు తొమ్మిది మున్సిపాలిటీలకు మహర్దశ పట్టనున్నది. జీడబ్ల్యుఎంసీతో పాటు మున్సిపాలిటీలకు వచ్చే యేడు మార్చికల్లా మాస్టర్ ప్లాన్-2050 తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వరంగల్ కార్పొరేషన్‌తో పాటు మిగతా మున్సిపాలిటీలు జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, వర్ధన్నపేట, భూపాలపల్లి మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తొలివిడతగా వరంగల్ కార్పొరేషన్‌తో పాటు మేజర్ మున్సిపాలిటీలైన జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల మున్సిపాలిటీలకు ఈ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నది. రెండో విడతగా మిగతా మున్సిపాలిటీలపై దృష్టి సారించనున్నది.

సీఎం ఆదేశం మేరకు..

కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా' గురించి వరంగల్‌లోనే సూత్రప్రాయంగా వెల్లడించారు. వరంగల్ నగరాభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, వరంగల్ నగర పాలక సంస్థ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థతో పాటు ఇతర మునిసిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంతో అర్బన్ అభివృద్ధి నమూనాపై దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే వరంగల్ మహానగర పాలక సంస్థ మాస్టర్-2050 ప్లాన్‌ను తెరమీదికి తీసుకువచ్చారు. ప్రస్తుతం సిద్ధంగా వరంగల్ మాస్టర్ ప్లాన్-2040 ఆమోదానికి సంబంధించిన అంశం చర్చకు వచ్చినప్పుడు సీఎం దీనిని యథాతథంగా ఆమోదించడానికి విముఖత వ్యక్తం చేశారు. పెరిగిన నగర జనాభా, అవసరాల దృష్ట్యా ఈ మాస్టర్‌ప్లాన్‌కు కాలం చెల్లిందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో అనుసరించిన అసంబద్ధ అర్బన్ అభివృద్ధి విధానాల వల్ల అంతా అస్తవ్యస్తంగా మారిందని, మాస్టర్‌ప్లాన్ ఆమోదించకుండా పదేళ్లు తొక్కిపెట్టడం వల్ల నగరం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందలేకపోయిందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త అర్బన్ ప్రణాళికను అమలు చేయబోతున్నట్టు సూచనాప్రాయంగా తెలియచేశారు. ప్రజల మౌలిక అవసరాలు, భవిష్యత్తులో నగర విస్తరణ, పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకొని వరంగల్ నగర మాస్టర్‌ప్లాన్-2040ని సవరించి వచ్చే 26 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ -2050ను రూపొందించాలని ఆదేశించారు. అయితే ఇదే అభివృద్ధి నమూనాను ఒక్క వరంగల్ నగరానికే కాకుండా యావత్ తెలంగాణ పట్టణాలకు వర్తించేలా అన్ని మున్సిపాలిటీల్లో అమలుకు కూడా 2050 మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. జీడబ్ల్యుజీఎంసీతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల అధికారులు ఈ దిశగా కసరత్తు చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్ -2050లో చెరువుల అభివృద్ధికి బ్లూ-గ్రీన్, కాలుష్య నివారణకు గ్రీన్ మొబిలిటీ, ఉద్గారాల నివారణకు, సౌరవిద్యుత్ వినియోగం ప్రోత్సహించే దిశగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు భాగంగా ఉంటాయి.

'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో ఉమ్మడి జిల్లాలోని వరంగల్ నగర పాలకసంస్థతో పాటు ఈ తొమ్మిది మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రాధాన్యత లభించనున్నది. వచ్చే యేడు మార్చి కల్లా ఇందుకు సంబంధించి మాస్టర్‌ప్లాన్ -2050 తయారు కానున్నది. రానున్న 26 ఏళ్లలో అభివృద్ధి చెందనున్న పట్టణాలను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించబోతున్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యుఎంసీ)తో పాటు ఈ మునిసిపాలిటీలు ఇందులో భాగం కానున్నాయి. మునిసిపాలిటీల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పట్టణ సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు సూచించింది. మాస్టర్ ప్లాన్ -2050తో జిల్లాలోని మునిసిపాలిటీలకు భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు ఒన గూరుతాయని అధికారులు వివరిస్తున్నారు. బ్లూ-గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలకు కలిపి 2024-26 సంవత్సరాల్లో రూ.13,700కోట్లను వ్యయం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో జిల్లాలోని పురపాలికలకూ నిధులు సమకూరుతాయి. దీంతో మౌలిక వసతులు మెరుగుపడతాయి. రాష్ట్రంలో 130 చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.350కోట్లను వెచ్చించనున్నది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లోని చెరువుల సంరక్షణకు సింహభాగం నిధులు అందనున్నాయి.

పలు ప్రాజెక్టులు

వరంగల్ కార్పొరేషన్‌తో పాటు జనగామ, మహబూబాబాద్ మునిసిపాలిటీలు చాలా పెద్దవి. పైగా వ్యాపారర, వాణిజ్య కేంద్రాలు. గ్రానైట్, లేటరైట్, ఇతరత్రా ముడిసరుకులు, వ్యవసాయ ఉత్పత్తులు పెద్ద ఎత్తున ఇక్కడి నుంచి రవాణా అవుతాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని రవాణాపరంగా వాతావరణ కాలుష్యం జరగకుండా నివారించేందుకు బ్లూ-గ్రీన్ ప్రాజెక్టు అమలుకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా మునిసిపాలిటీలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రతీ పట్టణానికి సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగం చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. ఇందులో భాగంగా ప్రతీ పట్టణంలో బ్లూ-గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపడుతోంది. బ్లూగ్రీన్ ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీల్లో ఉన్న గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, వాటి సుందరీకరణతో పాటు వరదల నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, పట్టణాల్లో హరితవనాల పెంపకం వంటివి చేపడతారు. ఇక గ్రీన్ మొబిలిటీ (హరిత రవాణా) ప్రాజెక్టుల్లో భాగంగా వరంగల్ నగరంతోపాటు జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి వంటి పెద్ద పట్టణాల్లో విద్యుత్ వాహనాలను పెద్ద ఎత్తున వినియోగించేలా ప్రోత్సహించి కాలుష్యాన్ని తగ్గిస్తారు. అవసరమున్న రద్దీ కూడళ్లలో పెద్దసంఖ్యలో ఫ్లైఓవర్ల నిర్మాణం వంటివి చేపడతారు. గ్రీన్ ఎనర్జీ పట్టణాల పేరుతో ప్రత్యేక ప్రాజెక్టులు కూడా చేపడతారు. నిర్మాణరంగంలో కర్బన ఉద్గారాలు వెలువడకుండా ఆధునాతన పర్యావరణ పరిరక్షణ పరిజ్ఞాన వినియోగం, సౌర విద్యుత్ వినియోగం వంటి గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాలు చేపడతారు.

సంజీవనిలా నిలుస్తున్న సీఎంఆర్ఎఫ్

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



భాదిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 3: ఆపదలో ఉన్న నిరుపేదలకు అపర సంజీవనిలా సీఎంఆర్ఎఫ్ పథకం నిలుస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన భాస్కుల కొమురయ్య అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శస్త్ర చికిత్స నిమిత్తం అయ్యే ఖర్చులకు గాను రూ. 2,50,000 విలువైన ఎల్వోసీని బాధిత కుటుంబ సభ్యులకు కడియం హనుమకొండలోని ఆయన నివాసంలో గురువారం అందించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

బచ్చన్నపేట, అక్టోబరు 3: ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో గురువారం సీపీఎం 15వ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రజల సొమ్మును బడా కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఆరు గ్యారంటీలు అమలు చేయటంలో విఫలమయ్యారని ఆరోపించారు. హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. సమావేశ ప్రారంభానికి ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పతాకావి ష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, రామగళ్ల అశోక్, మినలాపురం ఎల్లయ్య, రవి, బాబు, సిద్ధయ్య, శ్వేత, శ్రీలత, లక్ష్మీ, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు. గ్రామ నూతన కార్యదర్శిగా గోలకొండ రాజయ్యను ఎన్నుకున్నారు.

సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్

దసరా లోగా డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

వీసీలో సీఎం రేవంత్‌రెడ్డి

జనగామ రూరల్, అక్టోబరు 3: వరి ధాన్యం సేకరణలో సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) లో తెలిపారు. గురువారం ఖరీఫ్ 2024-25 వరిధాన్యం కొనుగోలుకు సంబంధించి, డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నియామక ఉత్తర్వులపై హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ సహ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లాలో పటిష్ఠ కార్యాచరణ తీసుకోవాలన్నారు. గతానికి భిన్నంగా ఈ సీజన్ నుంచి సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు వేరు వేరు కౌంటర్లు, కాంటాలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని, ప్రతిరోజు ధాన్యం నాణ్యత పరీక్షించి రికార్డులో నమోదు చేయాలన్నారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని గుర్తించే ందుకు గ్రెయిన్ క్యాలిపర్స్‌ను కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాల న్నారు. ఐకేపీ సెంటర్ల వద్ద ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం తెచ్చి తెలంగాణలో అమ్మే అవకాశం ఉన్నందున పోలీసు అధికారులు సరిహద్దుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి వాహ నాలను తనిఖీలు చేయాలని ఆదేశించారు. 11,062 పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ-2024 నోటిఫికేషన్ జారీ చేసి విజయవంతంగా పరీక్షలు నిర్వహించి 1:3 నిష్పత్తిలో 25,239 మంది అభ్యర్థులను ఎంపిక చేసి ఫలితాలు ప్రకటించామన్నారు. ఇప్పటి వరకు 9,090 మంది అభ్యర్థుల సర్టిఫికేట్ల వెరిఫికేషన్ జరిగిందని, ఈ నెల 5వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. ఈ నెల 9న సాయంత్రం 4 గంటలకు ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేయాలని ఆదేశించారు. వీసీలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీ పేరుతో ఫేక్ కాల్స్!

- పలువురు అధికారులకు బెదిరింపులు
- డబ్బులు డిమాండ్ చేస్తున్న కేటుగాళ్లు
- అసలు అధికారుల దాడులను అవకాశంగా తీసుకుంటున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



ఇటీవల ఏసీబీ దాడుల్లో పట్టుబడిన ఆర్‌అండ్‌బీ ఈఈ హుస్సేన్, ఏటీవో రవీందర్ (ఫైల్)

జనగామ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ పేరుతో కొందరు కేటుగాళ్లు కొత్త తరహా మోసానికి తెర లేపుతున్నారు. అవినీతి నిరోధక శాఖ అధికారులంటూ పలువురు అధికారులకు ఫేక్ ఫోన్ కాల్స్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో జనగామ కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని పలు శాఖల అధికారులకు ఫోన్లు చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. జనగామ జిల్లాలో ఇటీవల జరిగిన ఏసీబీ దాడులను అవకాశంగా మలుచుకున్న కేటుగాళ్లు పలువురు అధికారులకు ఫోన్లు చేస్తూ బెదిరిస్తున్నారు. తాము ఏసీబీ నుంచి కాల్ చేస్తున్నామని, మీ శాఖలో అవినీతి జరిగినట్లుగా తమ దృష్టికి గుర్తు తెలియని వ్యక్తులు అధికారులకు ఫోన్లు చేసి ఝలక్ ఇస్తున్నారు. తాము అడిగినంత ఇస్తే మీ కార్యాలయంపై దాడి చేయబోమంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గతేడాది డీఎంహెచ్‌వో ప్రశాంత్ ఏసీబీకి చిక్కగా ఇటీవల సెప్టెంబరు 27న రూ. 14 వేలు లంచం తీసుకుంటూ ఆర్ అండ్‌బీ ఈఈ హుస్సేన్, కార్యాలయం అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ రవీందర్ ఏసీబీ వలలో పడ్డారు. కలెక్టరేట్‌లో ఏడాదిలో రెండు ఏసీబీ దాడులు జరగడంతో అధికారుల్లో కలవరం ఏర్పడింది. కొందరు అవినీతి అధికారుల్లో భయం మొదలైంది. దీన్ని ఆసరాగా చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు కలెక్టరేట్‌లోని పలు శాఖల అధికారులకు ఫోన్లు చేయడం ప్రారంభించారు. తాజాగా ఒకటి, రెండు శాఖల అధికారులకు ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఫోన్ కాల్స్‌పై పలువురు అధికారులు ఆరా తీయగా ఫేక్ కాల్స్‌గా నిర్ధారణ జరిగింది. ఈ విషయం ఏసీబీ అధికారుల దృష్టికి కూడా వెళ్లింది. కాగా.. ఫోన్ కాల్స్ వచ్చిన అధికారులు కేటుగాళ్లకు భయపడి డబ్బులు పంపారా? లేదా? అన్నది మాత్రం బయటకు రావడం లేదు.

తరచూ ఇదే తరహా కాల్స్

ఉద్యోగాలు, ఏసీబీ పేరుతో కాల్స్ చేసిన సంఘటన జనగామ జిల్లాలో తరచుగా జరుగుతున్నాయి. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్ కింద ఇటీవల భర్తీ చేసిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టుల విషయంలోనూ గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు డిమాండ్ చేసిన విషయం వెలుగు చూసింది. డబ్బులు ఇస్తే ఉద్యోగం ఖాయమంటూ గుర్తు తెలియని వ్యక్తి ముగ్గురు మహిళా అభ్యర్థులకు ఫోన్లు చేశాడు. అందులో ఇద్దరు అభ్యర్థులు రూ. 50 వేలు, రూ.20 వేల చొప్పున పంపించారు. దీనిపై పోలీసులకు డీఎంహెచ్‌వో రవీందర్ ఫిర్యాదు సైతం చేశారు. ఇవే పోస్టు లకు సంబంధించి ఈ ఏడాది మొదట్లో ఏ వ్యక్తి ఇదే తరహా కాల్స్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన సంఘటన కూడా వెలుగు చూసింది. కాగా.. తాజాగా ఏసీబీ అధికారుల పేరుతో కాల్స్ చేసి డబ్బులు డిమాండ్ చేసినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో ఒకే వ్యక్తి ఈ తరహా మోసానికి పాల్పడుతున్నాడా? గ్రూపుగా మోసానికి తెర లేపుతున్నారా? తెలియాల్సి ఉంది. కాగా.. జిల్లాలో ఈ తరహా కాల్స్ వస్తుండడంతో జనగామ జిల్లాకే చెందిన వ్యక్తి కాల్స్ చేస్తున్నాడా? ఇతర జిల్లాకు చెందిన వాడా అన్నది లోతైన విచారణ చేస్తే బయటపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా అధికారులు కానీ సాధారణ ప్రజలు, అధికారులు ఇలాంటి ఫేక్‌కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఫేక్ కాల్స్‌కు స్పందించవద్దు :

సాంబయ్య, ఏసీబీ డీఎస్పీ



ఏసీబీ అధికారులమంటూ జనగామ కలెక్టరేట్‌లో కొందరు అధికారులకు ఫోన్ కాల్స్ వచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. ఏసీబీ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌కు ఎవరూ స్పందించి డబ్బులు పంపవద్దు. ఏసీపీ అధికారులు ఎవరూ కూడా ఫోన్ కాల్స్ చేసి డబ్బులు అడగరు. ఎవరికైనా బెదిరింపు ఫోన్లు వస్తే స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

సర్వే పూర్తిస్థాయిలో పక్కాగా జరగాలి

సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



కన్నాయిపల్లిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ కోసం వివరాలు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

రఘునాథపల్లి, అక్టోబరు 3: అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించే విధంగా ప్రభుత్వం జారీ చేయనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం జరుగుతున్న సర్వే పూర్తి స్థాయిలో పక్కాగా జరగాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం ఆయా కుటుంబాలకు సంబంధించిన పక్కా వివరాలు నమోదు చేసేందుకు గాను నిర్వహించే సర్వే కార్యక్రమం మండలంలోని కన్నాయిపల్లి, మాదారం గ్రామాలలో గురువారం ప్రారంభమైంది. పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని కన్నాయిపల్లిలో 196 కుటుంబాలు, మాదారంలో 178 కుటుంబాలతో కలిపి మొత్తం 374 కుటుంబాలను ఎంపిక చేశారు. కన్నాయిపల్లి గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు వివరాలు సేకరించే సర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమంలో కుటుంబ సభ్యులందరూ పక్కాగా తమ వివరా లను నమోదు చేసుకుని ప్రభుత్వం నుంచే లభించే బహుళ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నా రు. సర్వేలో కుటుంబంలో ఉన్న వ్యక్తుల పేరు, పుట్టిన తేదీ, వయస్సు, కుటుంబ పెద్దతో ఉన్న సంబంధం, ఆధార్ నెంబరు, అడ్రస్ తదితర వివరాలన్ని పక్కాగా..ఏ ఒక్కటి మిస్ కాకుండా నమోదు చేయాలని సర్వే నిర్వహిస్తున్న అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రతీ రోజు కనీసం 50 కుటుంబాల సర్వే నిర్వహించాలని తెలిపారు. ఒక్కొక్క గ్రామంలో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు సంబంధించిన ఆధార్ కార్డులు, పుట్టిన తేదీ, తదితర వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. సర్వే కార్యక్రమంలో తహసీల్దార్ మోహిన్ ముజ్తబ, ఎంపీ డీవో శ్రీనివాసులు, ఎంపీవో వెంకటేశ్వర్లు, డీఎల్‌పీవో వెంకటరెడ్డి, ఆర్ఐలు సాయిబాబా, కిషోర్, ఎంఆర్ఐ శరత్, పంచాయతీ కార్యదర్శులు అంతగల్ల కుమార్, భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉమ్మగోని సరిత, యాట మంగమ్మ, నిర్మల, అరూరి సత్తమ్మ, ఉమ్మగోని రాకేష్ పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షే మ పథకాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చే యనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పూర్తి స్థాయిలో పక్కాగా జరగాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను కలెక్టర్ గురువారం జిల్లా కేంద్రంలో 24వ వార్డులో పరిశీలించారు. అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసినిలు మండలంలోని ఎర్రగొల్లపహాడ్ శివారులోని పెద్దతండా(వై) లో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే చేస్తున్న అధికారులు కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ నంబరు, అడ్రస్ ఏ ఒక్కటి మిస్ కాకుండా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపు సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

జనగామ రూరల్, అక్టోబరు 3: న్యాయవాదిపై దాడి చేసిన పోలీస్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. జనగామ కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రరుషి మాట్లాడుతూ న్యాయవాదులపై రోజు రోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. హైదరాబాద్ నాంపెల్లి కోర్టులో న్యాయవాది ఇమ్రాన్‌పై కోర్టు కానిస్టేబుల్ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన పోలీస్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పోస్టుపై అనిశ్చితి

వరంగల్ మెడికల్, అక్టోబరు 3: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉన్నట్లా? లేనట్టా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన విజయలక్ష్మీ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకోగా, డీఎంఈ సానుకూలంగా స్పందించలేదని తెలిసింది. కాగా, ఇటీవలే ఇక్కడికి ప్రొఫెసర్‌గా బదిలీపై వచ్చిన డాక్టర్ రాజేశ్వరిని ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగాలని డీఎంఈ ఆదేశించారు. అయితే సూపరింటెండెంట్ బాధ్యతలు తీసుకోలేనని డీఎంఈకి మొరపెట్టుకున్నట్లు తెలిసింది. డాక్టర్ విజయలక్ష్మి సెలవుపై వెళ్లడం, కొత్తగా డాక్టర్ రాజేశ్వరికి సూపరింటెండెంట్‌గా బాధ్యతలను తీసుకోవడానికి సిద్ధంగా లేకపోవడంతో జీఎంహెచ్ పాలన అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





నేడే కేయూ కొత్త వీసీ ఎంపిక

- సెక్రటేరియెట్‌లో సెర్చ్ కమిటీ కీలక సమావేశం
- వీసీ పదవిపై గంపెడాశలతో ఆశావహులు
- హైదరాబాద్‌లోనే తిష్ఠ వేసి గాడ్ ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 3: కాకతీయ యూనివర్సిటీకి కొత్త వైస్ చాన్స్‌లర్ ఎంపిక ప్రక్రియ తుది ఘట్టానికి చేరింది. ఈనెల 4న శుక్రవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. గతంలో వెలువరించిన నోటిఫికేషన్ మేరకు కేయూ వీసీ పదవి కోసం వర్సిటీలో పనిచేస్తూ 10 ఏళ్ల సర్వీసు పూర్తయిన ప్రొఫెసర్లు, రిటైర్డు ప్రొఫెసర్లతో పాటు ఇతర వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో సరైన అర్హతలు, సామాజిక సమీకరణాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు అనుభవజ్ఞులైన ముగ్గురిని వీసీ పదవికి సెర్చ్ కమిటీ తుది ఎంపిక చేస్తోంది. కేయూ వీసీ పదవికి సెర్చ్ కమిటీ సభ్యులు వచ్చిన దరఖాస్తుల్లోంచి ముగ్గురిని అర్హతల మేరకు ఎంపిక చేస్తారు. తుది ఎంపికలో ఖరారైన ముగ్గురి పేర్లను సీల్డ్ కవర్‌లో రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తారు. గవర్నర్ సీఎం ఆమోదంతో సీల్డ్ కవర్‌లోని ముగ్గురిలో ఒక్కరిని వీసీగా ప్రకటిస్తారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే వారం, పది రోజుల్లో వర్సిటీకి కొత్త వీసీ బాధ్యతలు చేపట్టనున్నారు.

గంపెడాశతో ప్రొఫెసర్లు

కేయూ వీసీ పోస్టుపై గంపెడాశతో ఎందరో అర్హులైన ప్రొఫెసర్లు ఎదురు చూస్తున్నారు. తమకు తెలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు తమ సామాజిక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులతో ఇప్పటికే పైరవీలకు దిగారు. గతంలో వర్సిటీలో నిర్వహించిన పదవులు, ఇతర అనుభవాలతో పాటు, సామాజిక, రాజకీయ అర్హతలను విన్నవిస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. తమకు దగ్గరైన గాడ్‌ఫాదర్ల చుట్టూ తిరుగుతూ ముమ్మరంగా పైరవీలు చేసుకుంటున్నారు. సర్వీసులో ఉన్న వారితో పాటు రిటైర్డు ప్రొఫెసర్లు ఈ దఫా వీసీ పదవికి తీవ్రంగా పోటీ పడుతున్నారు.

ఎస్సీ లేదా ఓసీలకు అవకాశం

కేయూకు ఈ దఫా వచ్చే వీసీ ఎస్సీ లేదా ఓసీ వర్గాలకు చెందిన వారే వస్తారని అంచనా వేస్తున్నారు. గతంలో బీసీ వర్గానికి చెందిన ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం వీసీగా అవకాశం కల్పించింది. అంతకుముందు రెండు దఫాలుగా ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన ప్రొఫెసర్ బి.వెంకటరత్నం, ప్రొఫెసర్ ఆర్.సాయన్నలకు అవకాశం కల్పించింది. ఈ దఫా మళ్లీ ఎస్సీకి అవకాశం ఇస్తారా..? ఓసీ వర్గాలకు ఇస్తారా ? అనే అంశంలో సందిగ్ధత నడుస్తోంది. ఓసీ వర్గాల నుంచి ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి వైఎస్ఆర్ హయాంలో వీసీగా సేవలందించారు. అయితే రాష్ట్రంలోని 10 వర్సిటీల్లో సామాజిక సమీకరణాలు కలిసి రాకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో కేయూ వీసీ పదవి బీసీలకు వచ్చే అవకాశం వుంది.

సమర్థులకు అవకాశం వచ్చేనా ?

కేయూ వీసీ ఈ దఫానైనా సమర్థవంతులైన వారికి తగ్గుతుందా ? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గత వీసీ పాలనలో వర్సిటీ అభాసుపాలైంది. అదే క్రమంలో వర్సిటీ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా మాజీ వీసీ తాటికొండ రమేశ్ అపఖ్యాతి పాలయ్యారు. విజిలెన్స్ విచారణలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సందర్భంలో కేయూ సమర్థవంతులైన వారే వీసీగా రావాలని వర్సిటీ అధ్యాపక వర్గాలు భావిస్తున్నాయి. వర్సిటీలో పరిపాలన, బోధన, బోధనేతర సమస్యలతో పాటు సంస్థాగతమైన అనేక ఇబ్బందులున్నాయి. రీసెర్చ్‌తో పాటు క్లాస్‌వర్క్‌లోనూ వెనుకబడింది. వీటన్నింటినీ అధిగమించాలంటే సమర్థవంతులైన వీసీ రావాలనే భావన విద్యావేత్తల్లో నెలకొంది.

సెర్చ్ కమిటీ

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారితో పాటు మరో ఇద్దరు సభ్యులతో సెర్చ్ కమిటీని నియమించారు. కేయూ సెర్చ్ కమిటీలో జమ్మూ కశ్మీర్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ సంజీవ్ జైన్, వర్సిటీ పాలక మండలి నామినీ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఎ.దామోదర్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారిలు సభ్యులుగా ఎంపికయ్యారు.

పీహెచ్‌డీ సీట్ల కోసం ఆందోళనలు

- సెల్ టవర్ ఎక్కి విద్యార్థుల నిరసన
- సర్ది చెప్పిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి, డీన్లు, అధికారులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 3: కేయూలో పీహెచ్‌డీ సీట్ల అడ్మిషన్లలో న్యాయం చేయాలని కోరుతూ గురువారం విద్యార్థులు నిరసన, ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయా లంటూ ఏకంగా వర్సిటీ పరిపాలన భవనంలో పురుగుల మందుల డబ్బాలను పట్టుకుని హల్ చల్ చేశారు. అలాగే వర్సిటీలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి దిగడంతో కొద్దిసేపు వర్సిటీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వర్సి టీ పీహెచ్‌డీ కేటగిరి-2 అడ్మిషన్లలో తమకు న్యా యం చేయాలని అనేక దఫాలుగా జిల్లా మం త్రులు, కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయితే రిజిస్ట్రా ర్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పీహెచ్‌డీ కేటగిరి-2 అడ్మిషన్ల విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. దీంతో తమకు అడ్మిష న్లలో అన్యాయం జరుగుతోందని ఆరోపిం చారు. గతంలో పీహెచ్‌డీ సీట్ల కోసం తాము ఆందోళనలు చేశామని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామన్నారు. సీఎం రేవం త్‌రెడ్డి, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణలు కల్పించుకుని పీహెచ్‌డీ ఆశావహులైన మిగతా విద్యార్థులకు న్యాయం చేయాలని రిజిస్ట్రార్‌కు అప్పగిస్తే పట్టించు కోకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు.


సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులను మానసికంగా వేదిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, ఈసీ మెంబర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ చిర్ర రాజులు ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చి సముదాయించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వ గా, శాంతించి సెల్ టవర్ దిగారు. ఈ నిరసన ఆందోళనల్లో పీహెచ్‌డీ ఆశావహులైన మంద నరేశ్, బొట్ల మనోహర్, బందిగ రాకేశ్, తిరుపతి నాయక్, సోరుపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హీరో గ్లామర్ ఓజీ ఆవిష్కరణ

బాలసముద్రం, అక్టోబరు 3: హనుమకొండ శ్రీ వైష్ణవి ఆటోమొబైల్స్ షోరూమ్‌లో హీరో గ్లామర్ ఓజీ (ఒరిజినల్)వాహనాన్ని గురువారం షోరూమ్ అధినేత చందుపట్ల సత్యపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వాహనం ప్రత్యేకతలు గురించి తెలియజేశారు. గ్లామర్ ఓజీ 125 సీసీ హెచ్చు సింబల్ ఎల్ఈడీ ప్రొజెక్టర్, హెడ్ ల్యాంప్, ఫుల్లీ డిజిటల్ స్పీడ్ మోటార్స్, ఇండికేట్స్, ఇండికేటర్ హాజార్డ్ స్విచ్, అలాగే సెల్ఫ్ స్టార్ట్ ఇంజన్, కట్ ఆఫ్ స్విచ్ ఈ వాహన ప్రతేకతలని తెలిపారు.

లీటర్‌కు మైలేజీ 65 కిలోమీటర్లు వస్తుందన్నారు. ఈ పండుగకు రెగ్యులర్ గ్లామర్ వాహనాలకు 3000 నుంచి 5000 వరకు నగదు బెనిఫిట్స్ ఇస్తున్నామన్నారు. వినియోగదారులు ఈ ఆఫర్లను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మధు, సర్వీసు మేనేజర్ జబ్బార్, ఫైనాన్షియర్స్, ఇన్సూరెన్స్ మేనేజర్స్ కన్నమర్లు తదితరులు పాల్గొన్నారు.


హీరో గ్లామర్ ఓజీని ఆవిష్కరిస్తున్న చందుపట్ల సత్యపాల్‌రెడ్డి

సందడిగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 3: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు సందడిగా గురువారం ప్రారంభమయ్యాయి. జూనియర్స్, సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో 40మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రాజేందర్ తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి క్రీడాకారులను ఈనెల 5, 6 తేదీలలో హైదరాబాద్ షేక్‌పేటలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని బాక్సింగ్‌హాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, సభ్యులు గిరిధర్, రఘు, కృష్ణమూర్తి, సీని యర్ బాక్సర్లు రెబాన్, దివ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

రేపు పోలీసు వాహనాల పాత విడిభాగాల వేలం

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పాత విడిభాగాలను శనివారం వేలం వేయనున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రిపేర్ చేయబడిన బ్యాటరీలు, టైర్లు, విడిభాగాలను వేలంలో అందుబా టులో ఉంచుతామని, ఆసక్తి గల వ్యక్తులు శనివారం ఉదయం 10 గంటలకు కమిషరేట్ కార్యాలయంలోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ (యంటీవో)లో సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన


వరంగల్ జిల్లా అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 3: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. ఈ నెల 5 వరకు ఈ పరిశీలన కొనసాగనుంది. గురువారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనలో వరంగల్ జిల్లాలో ఎస్జీటీలకు సంబంధించిన 372మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలనను పూర్తిచేసినట్లు డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన 10అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి చేశామన్నారు.

మొత్తం 382 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది. ఇక హనుమకొండ జిల్లాలో మొత్తం 233 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినట్లు డీఈవో డి.వాసంతి తెలిపారు. కాగా, రాష్ట్ర పరిశీలకురాలు జేడీ విజయలక్ష్మి ప్రభుత్వ డైట్ కళాశాల, సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరిశీలన కేంద్రాలను సందర్శించారు. సర్టిఫికెట్ల పరిశీలన తీరును ఆమె డీఈవోలను అడిగి తెలుసుకుని సమీక్షించారు.

సెమీ ఫైనల్స్‌కు చేరిన కరీంనగర్, ఖమ్మం జిల్లా జట్లు

కొనసాగుతున్న అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 3: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. పూల్ బీలోని ఖమ్మం - నిజామాబాద్ జట్ల మధ్య గురువారం కోమటిపల్లి క్రీడామైదానంలో నిర్వహించిన కీలక మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటిం గ్ ఎంచుకున్న నిజామాబాద్ జిల్లా జట్టు నిర్ణీత 45 ఓవర్లను ఎదుర్కొని 207భారీ స్కోరును సాధిం చింది. నిజామాబాద్ జట్టు ఓపెనర్ ప్రతాప్ 48పరుగులు చేయగా, మరో బ్యాట్స్‌మెన్ విక్రాంత్ రెడ్డి 98 బంతులను ఎదుర్కొని 11 బౌండరీలు, 11 సిక్సర్లతో 137 పరుగులు జట్టుకు అందించి భారీ పరుగుల విజయ లక్ష్యన్ని ఖమ్మం జట్టు ముందుం చాడు. కాగా, 208 పరుగుల భారీ లక్ష్య సాధనలో బ్యాటింగ్ బరిలోకి దిగిన ఖమ్మం జట్టు బ్యాట్స్‌మెన్లు దివిన్ 75 పరుగులు, రత్న ఆర్యన్‌ల 45 పరుగులతో రాణించారు. ఇదే జట్టులోని బౌలర్ ధృవతేజా 4వికెట్లు తీసి ప్రత్యర్థి నిజామాబాద్ జట్టు పరుగులను కట్టడి చేయడంతో పాటు 8వ డౌన్ బ్యాటింగ్ బరిలోకి దిగి 26 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌తో తమ జట్టు విజయంలో కీలక భూమిక పోషించి ఖమ్మం జట్టు సెమీస్ చేరడంతో కీలక భూమిక పోషించాడు. అదేవిధంగా పూల్ బీలోని ఆదిలాబాద్ - కరీంనగర్ జట్ల మధ్య వరంగల్‌లోని మొగిలిచర్ల క్రీడా మైదానంలో నిర్వహించిన పోరులో 63పరుగుల భారీ తేడాతో ఆదిలాబాద్ జట్టుపై కరీంనగర్ జట్టు విజయం సాధించింది.


98 బాల్స్‌లో 137 పరుగులు సాధించిన విక్రాంత్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 50ఓవర్లకు గాను 46.3 ఓవర్లను ఎదుర్కొని 165 గౌరవప్రదమైన పరుగులు సాధించి ఆలౌట్ కాగా, ఇదే జట్టుకు చెందిన బ్యాట్స్‌మెన్ విజ్ఞన్ 59పరుగులతో రాణించాడు. తదుపరి 166 పరుగుల లక్ష్య చేదనలో బరిలోకి దిగిన ఆదిలాబాద్ జట్టు కేవలం 32. 3ఓవర్లను ఎదుర్కొని 102 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో 63 పరుగుల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై కరీంనగర్ జిల్లా జట్టు విజయకేతనం ఎగరవేసి సెమీ ఫైనల్‌కు చేరింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు మట్టెడకుమార్ బండారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బాలత్రిపుర సుందరిగా భద్రకాళి

- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు షురూ
- అమ్మవారికి బంగారు కిరీటం అలంకరణ

వరంగల్ కల్చరల్, అక్టోబరు 3: స్వయంభూగా కొలువుదీరిన ఓరుగల్లులోని చరిత్రాత్మకమైన భద్రకాళి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలిరోజు శైలిపుత్రి క్రమంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరీగా అలంకరించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిత్య, గణపతి, గురుపూజలతో పాటు సుగంధ పరిమళ పూర్ణాభిషేకం, నవరాత్రి వ్రతం ఆరంభం, ధ్వజారోహణం, కలశస్థాపన చేశారు. వీటితో పాటు చండీహోమం, వేద పారాయణం, లక్ష్మీనారాయణ, వనదుర్గా, దేవీ భాగవతం, సుందర కాండ, శ్రీమద్భాగవతం పారాయణాలు, విశేషపూజలు, మహా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన బంగారు కిరీటాన్ని బ్యాంకు నుంచి తీసుకొచ్చి అలంకరించారు. ఉదయం అమ్మవారు వృషభ వాహనంపై ఊరేగగా సాయంత్రం 7 గంటలకు యోగా నిద్రాక్రమంలో మృగజింక వాహనంపై అమ్మవారు ఊరేగారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శిం చుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో శేషు భారతి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, కూచన హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నైపుణ్యత పెంపొందించుకోవాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: పోలీసు అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తిలో నైపుణ్యత సాధించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆవరణలో గురువారం జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు వృత్తి నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారా నేరస్థులను త్వరితగతిన పట్టుకోవడంతో పాటు ప్రజలకు సత్వరమే న్యాయం అందించగలరన్నారు. కాగా, ఈ మీట్‌లో అధికారులు, సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో చేపట్టే ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్ హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, వీడియోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీల్లో విభాగాల వారీగా ప్రతిభ చూపిన ఇద్దరిని ఎంపిక చేసి ఈ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించే ప్రథమ పోలీస్ డ్యూటీ మీట్‌కు పంపిస్తామన్నారు. ఈ మీట్‌లో జోనల్ పరిధిలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం పోలీసులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల గుట్కాల పట్టివేత

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కాలను పెద్ద మొత్తంలో నిల్వ చేసి గుట్టుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వ్యక్తుల నుంచి రూ.10లక్షల విలువ చేసే గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్కా విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే పక్కా సమాచారం మేరకు కుమార్‌పల్లి మార్కెట్‌లోని లక్ష్మీ జనరల్ స్టోర్ నిర్వాహకుడు రాజ్‌పురోహిత్ నుంచి రూ. 6,04,800 విలువ చేసే వివిధ నిషేధిత గుట్కాలు, శివమ్ జనరల్ స్టోర్స్ నిర్వాహకుడు కిరణ్ నుంచి రూ.3,58,300 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో..

హనుమకొండ టౌన్ : ఏనుమాముల పీఎస్ పరిధిలో కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం భారీ మొత్తంలో గుట్కాలను పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. పక్కా సమాచారం మేరకు గురువారం వరంగల్ ఎన్టీఆర్ నగర్‌లో హుజూరాబాద్ మండలం ఇప్పల్ నర్సింగపూర్‌కు చెందిన గుట్కా సరఫరాదారుడు రావి శ్రీధర్, స్థానికుడైన పాన్‌షాపు నిర్వాహకుడు గుండ క్రిష్ణల నుంచి రూ.8,91,100 విలువ చేసే గుట్కాలను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

దండకారణ్యంలో ఏం జరుగుతోంది ?

- కోయవీరాపురం అడవుల్లో మావోయిస్టులు సమావేశం!
- చర్చనీయాంశంగా మారిన మావోయిస్టుల రాక
- పోలీసుల ఆరా

వాజేడు, అక్టోబరు 3: దండకారణ్యం నివురుగప్పిన నిప్పులా ఉంది. ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి మావోయిస్టులు తెలంగాణలోకి ప్రవేశించినట్టు ప్రచారం జరుగుతోంది. మండలంలోని కోయవీరాపురం అడవుల్లో నాలుగు రోజుల క్రితం మావోయిస్టులు సమావేశమైనట్టు సమాచారం. గ్రామంలోకి సాయుధులైన మావోయిస్టులు అర్ధరాత్రి వేళ ప్రవేశించి సమావేశం నిర్వహించినట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టులు కోయవీరాపురంలో భేటీ అయి తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. ఓ వైపు డీజీపీ తెలంగాణలో మావోయిస్టులు లేరని ప్రకటనలు చేస్తున్న క్రమంలో ఏజెన్సీ మండలమైన వాజేడులో మావోయిస్టులు ఈ సమావేశం నిర్వహించారనే విషయం సంచలనంగా మారింది. మావోయిస్టులు తమ పార్టీ కార్యకలాపాలను చాపకింద నీరులా నిర్వహిస్తున్నట్టు తెలుస్తుండగా ప్రశాంతంగా ఉన్న వాజేడు మండల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

కొన్నేళ్లుగా వాజేడులో మావోయిస్టుల కార్యకలాపాలు స్తబ్దుగా ఉన్న నేపథ్యంలో తాజా సంఘటన టార్గెట్‌గా ఉన్న నేతలను కలవరపెడుతోంది. ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష రాజకీయ నాయకుల్లో ఆందోళన నెలకొన్నట్టు సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం, జిల్లాలోని వెంకటాపురం(నూగూరు) సరిహద్దు అడవుల్లో మావోయిస్టుల కార్యకలాపాలు అధికంగా ఉంటాయి. ప్రస్తుతం వాజేడు మండలంలో మావోయిస్టులు సమావేశం నిర్వహించడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దండకారణ్యంలో ఏం జరుగుతుందోనని సరిహద్దు గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

పోలీసుల అదుపులో గిరిజనులు ?

కోయవీరాపురం అడవుల్లో మావోయిస్టులు సమావేశం నిర్వహించారనే అంశంపై పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల సమావేశం ఆలస్యంగా పోలీసుల చెవిన పడడంతో తమకు ఉన్న నిఘా వ్యవస్థతో వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. కోయవీరాపురానికి చెందిన ఓ 10 మంది గిరిజనులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. మావోయిస్టుల సమావేశంలో పాల్గొన్నారా.. ? లేదా సహకరించారా ? అని ఆరా తీస్తున్నట్లు సమాచారం. సీఐతో పాటు పలువురు ఎస్సైలు ఈ కీలక ఘటనపై వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలిసింది. మావోయిస్టులు, పోలీ సుల మధ్య అమాయక గిరిజనులు నలుగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతుండగా మావోయిస్టుల సమావేశంపై ఇప్పటి వరకు పోలీసు వర్గాలు అధికారి కంగా ధ్రువీకరించలేదు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


కొడకండ్లలో రాజరాజేశ్వరీ ఆలయంలో పూజలు..


స్టేషన్ ఘన్‌పూర్ ఎల్లమ్మ దేవాలయంలో పూజలు


లింగాలఘణపురం వడ్డిచర్లలో పూజలు


తాటికొండలో ఉత్సవాల్లో హోమం కాలుస్తున్న భక్తులు


పాలకుర్తిలో బాల త్రిపుర సుందరి అవతారం


నర్మెటలో ఉత్సవమూర్తి అమ్మవారు


జఫర్‌గడ్‌లో ఏర్పాటు చేసిన ఉత్సవమూర్తి


శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చిన్నపెండ్యాలలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద భక్తులు

లింగాలఘణపురం, అక్టోబరు 3: మండల వ్యాప్తంగా గురువారం దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని వడ్డి చర్లలో స్వయంభువుగా వెలిసిన భూలక్ష్మీ అమ్మవారి ఆలయ ంలో శాస్త్రోక్తంగా నవరాత్రి ఉత్సవాలను ప్రారం భించారు. మొదటి రోజు శ్రీబాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమి చ్చారు. లింగాల ఘణపురం, వడ్డిచర్ల, వనపర్తి గ్రామాల్లో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను ఉత్సవకమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పూజలను నిర్వహించారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : డివిజన్ కేంద్రం స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో బతుకమ్మ, విజయ దశమి పర్వదినోత్సవాలను పురస్కరి ంచుకుని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక హనుమాన్ జ్యోతిషాలయంలో, ఎల్లమ్మ దేవాలయంలో, శివునిపల్లి గాంధీ విగ్రహం వద్ద, లలితాంబికా దేవాలయంలో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజారులు ఎన్.బ్రహ్మచారి, ఎస్.శ్రీనివాసాచారి, గన్ను శ్రీనివాస్, సునిత, జి.రమేశ్, ఎం.విజయ్‌కుమార్, రాణి, శివ, సాత్విక్, సృజన్, కె.సతీష్, ఈశ్వర ప్రసాద్, రవీందర్ పాల్గొన్నారు.

● చిలుపూర్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మం డలంలోని చిన్నపెండ్యాలలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు పలువురు భక్తులు పెద్దసం ఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గురువారం స్థానిక చేనేత ఐక్యవేదిక నియోజకవర్గ ఇన్‌చార్జి, చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయ మాజీ డైరెక్టర్ గజ్జెల దామోదర్ - వేదవతి, మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి సమ్మయ్య - ఉమ దంపతుల నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి నైవేద్యం సమర్పించారు. అలాగే చిలుపూర్ మండల కేంద్ర ంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద పూజారి బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పూజారి యల్లంభట్ల కరుణాకర్ శర్మ, నారగోని రాజుగౌడ్, గనగోని రమేష్, తోట రావన్, బోనగిరి శేఖర్, గజ్జెల సోమక్క, పేరాల భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

● నర్మెట : మండలకేంద్రంతో పాటు వెల్దండ గ్రామంలో దుర్గామాత ఉత్సవాలు ఘనంగా ప్రారం భమయ్యాయి. మండలకేంద్రంలో మసీదు గడ్డ యూ త్ ఆధ్వర్యంలో దుర్గామాత శరన్నరాత్సోవాలు గురు వారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వెల్దండ గ్రామం లో యువజన సంఘాల ఆధ్వర్యంలో గ్రామ పంచా యతీ వద్ద మండపం ఏర్పాటు చేసి దుర్గామాతను ప్రతిష్ఠించారు. మొదటిరోజు దుర్గామాత మండప నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

● పాలకుర్తి : శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఆలయన పూజారులు, పండితుల మంత్రోచ్చరణల నబుమ గురువారం మొదటి రోజున బాల త్రిపుర సుందరి దేవి అలంకరణలో పార్వతీ అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా కోర్టు న్యాయమూర్తి సుచరిత దంపతులు సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మోహన్‌బాబు, ఎస్సై సాయిప్రసన్న కుమార్, ఆలయ సూపరింటెండెంట్ వెంకటయ్య, అర్చకులు డీ.వీ.ఆర్ శర్మ, చండీ ఉపాసకులు అయ్య దేవర నాగరాజు శర్మ, అనిల్‌శర్మ సిబ్బంది ఉన్నారు.

● కొడకండ్ల : మండంలోని అన్ని గ్రామాల్లో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవా లను గురువారం ప్రారంభి ంచారు. కొడకండ్ల మండల కేంద్రంలో ని రాజరాజేశ్వరీ ఆలయంలో పాలకుర్తి గౌతం శర్మ ఆధ్వర్యంలో వేదపండి తులు కలశ స్థాపన, శ్రీ చక్ర ఆర్చన. అరుణ హోమాలు నిర్వహించారు. కొడకండ్లలోని త్రిశూల్ సేన యూత్, స్నేహ యూత్, చత్రపతి శివాజీ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో పిండిపోలు మౌర్య శర్మ, అజయ్, రాజేష్, రాపోలు హేమంత్, నర్మెట, శేఖర్, ముత్యం వెంకటేశ్, విశ్వాస్ ఉన్నారు.

●స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తాటికొండ గ్రామంలోని కనకదుర్గా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజున అమ్మవారు స్వర్ణకవ చాలంకృతిలో దర్శనం ఇచ్చింది. ఆలయ అర్చకుడు వరుణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, నిత్యహోమం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వహకులు పండు గ రాజేశ్వర్, బుచ్చయ్య, కనకయ్య, నారబోయిన గోపాల్, రాములు, నాగరా జు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి జఫర్‌గడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని కూనూరులో గురువారం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. తొలి రోజు అమ్మవారు బాల త్రిపురసుందరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు, మహిళలు దేవీ మాతను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బచ్చన్నపేట, అక్టోబరు 3: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృంద సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని జీపీ ఆవరణలో పాటలు పాడుతూ ప్రదర్శనలిచ్చారు. అనుమానిత వ్యక్తులకు సెల్‌ఫోన్‌లు ఇవ్వరాదని, అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌లు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కళాకారులు పిన్నింటి రత్నం, సంజీవ, గణేశ్, కనకరాజు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట ఎస్‌ఐగా హమీద్



బచ్చన్నపేట, అక్టోబరు 3: బచ్చన్నపేట ఎస్‌ఐగా ఎస్‌కే హమీద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సతీష్ ఐటీ సెల్‌కు బదిలీ చేయగా, వీఆర్‌లో ఉన్న హమీద్‌ను ఇక్కడ నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయటంతో పాటు, మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తమ శాఖ పరిధిలోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా తనను కలిసి సమస్యను తెలపవచ్చన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై నిండు జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రజాచైతన్యం కోసం పలు కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా పలు పార్టీల నేతలు, మాజీ ప్రజాప్రతి నిధులు ఎస్‌ఐని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నాయీ బ్రాహ్మణ సేవాసంఘం
మండలాధ్యక్షుడిగా కొత్తపల్లి సమ్మయ్య



చిలుపూర్, అక్టోబరు 3 : నాయీ బ్రాహ్మణ సేవాసంఘం మండల అధ్యక్షునిగా చిలుపూర్‌కు చెందిన కొత్తపల్లి సమ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు గురువారం చిలుపూర్ మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన సంఘ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండలాధ్యక్షుడు సమ్మయ్య మాట్లాడుతూ గ్రామాల్లో నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రధాన కార్యదర్శిగా మామిడాల శ్రీనివాస్, కోశాధికారిగా ఎలకంటి సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా నాగవెళ్లి రాజు తదితరులను ఎన్నుకున్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

జనగామ కల్చరల్, అక్టోబరు 3: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్ (టీటీయూసీ) ప్రధాన కార్యదర్శి నిమ్మల రాంచందర్ అన్నారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ యూనియన్ సభ్యులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులకు దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వనమాల యాదగిరి, ఆవుల మల్లయ్య, బనుక వీరస్వామి, బి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిందు కళాకారుడి కుటుంబానికి ఆర్థికసాయం

దేవరుప్పుల, అక్టోబరు 3: రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన చిందుయక్షగాన కళాకారుడి కుటుంబానికి గురువారం మండలంలోని అప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చిందుయక్షగాన కళాకారుడు, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య ఆర్థిక సాయం అందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం సోమారం గ్రామానికి చెందిన చిందుయక్షగాన కళాకారుడు పిల్లిట్ల చంద్రమౌళి సెప్టెంబరు 20న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గాంధీలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో సమ్మయ్య సోమారం గ్రామానికి వెళ్లి చంద్రమౌళి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు.

రైతు ధర్నాను విజయవంతం చేయాలి

దేవరుప్పుల, అక్టోబరు 3: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో రైతు రుణమాఫీ 2లక్షలు చేస్తాననీ ఇచ్చిన హామీని విస్మరించినందున ఈనెల 4న శుక్రవారం తొర్రూర్‌లో తలపెట్టిన రైతు ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ కోరారు. ఈసందర్భంగా దేవరుప్పుల బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాజీ మంత్రులు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావులు హాజరవుతారని తెలిపారు. ధర్నాకు బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, నాయకులు బస్వ మల్లేశం, కొల్లూరు సోమయ్య, చింత రవి, ఆలకుంట్ల యాదగిరిపాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎలక్ట్రీషియన్ మృతి


రమేష్(ఫైల్)

లింగాలఘణపురం, అక్టోబరు3: లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన జాగిల్లాపురం రమేశ్(33)అనే ఎలక్ట్రీషియన్ గురువారం అనారోగ్యంతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడు రమేశ్ మూడేళ్ల క్రితం దాకా విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ పద్దతిన కట్టర్‌గా పనిచేశాడు. అయితే విధుల నిర్వర్తనలో భాగంగా విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా విద్యుదాఘా తానికి గురై కిందపడిపోయాడు. దీంతో వెన్నెముక విరిగి మంచానికే పరిమితమై చికిత్స పొందు తున్నాడు. ఈక్రమంలో రమేశ్ ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో గురువారం మృతి చెందాడు. అయితే కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న రమేశ్ నిబంధనల ప్రకారం విద్యుత్ స్తంభం ఎక్కాల్సిన అవసరం లేకున్నా అధికారులు దగ్గరుండి ఎక్కించడంతో ప్రమాదం జరిగింది. దీంతో పెళ్లైన ఏడాదిలోపే రమేశ్ మంచం పట్టి ఆఖరికి మృతి చెందడం పట్ల గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి.

ఈనెల 7న ఐద్వా జిల్లా మహాసభ

జనగామ రూరల్, అక్టోబరు 3: ఈనెల 7న జనగామలో నిర్వహించే ఐద్వా జిల్లా మహసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం(ఐద్వా) కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య, కార్యదర్శి ఎండీ షబానాలు మాట్లాడుతూ స్త్రీల హక్కుల కోసం ఐద్వా దేశం, రాష్ట్రంలో నిర్విరామ కృషి చేస్తుందన్నారు. ఈనెల 7న జనగామ జిల్లా కేంద్రంలోని విజయ పంక్షన్ హల్లో నిర్వహించే జిల్లా మహసభను నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథిగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత హాజరవుతారని తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బండా రమాదేవి, పందిళ్ల కళ్యాణి, మోకు భవాని, కొండ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక


సమావేశంలో పాల్గొన్న టీపీయూఎస్ నాయకులు

జనగామ కల్చరల్, అక్టోబరు 3: జనగామ జిల్లా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా చల్లా తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వంగ మల్లారెడ్డి, కోశాధికారిగా కట్ల కోటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ప్రకారం పెండింగ్‌లో ఉన్న డీఏలను, కొత్త పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పేర్ల నమోదు ప్రారంభమైందని, వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో టీపీయూఎస్ అభ్యర్థి నిలబడుతున్నాడని, గెలుపు కోసం అందరూ కృషి చేయాలన్నారు. బత్తుల నరేందర్ ఎన్నికల అధికారిగా వ్యవహ రించగా రాష్ట్ర బాధ్యులు మునిని వేణుగోపాల్, తాటికొండ పంచాక్షరి ఎన్నికలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గంగిశెట్టి మనోజ్‌కుమార్, మండలాల బాధ్యులు భాస్కరుని పృథ్వీరాజ్, పి.నవీన్, తప్పెట్ల సిద్ధులు, దొంతుల శ్రీనివాస్, జి.యాదగిరి, పెద్దన్న, ఉగ్రరాములు, సిద్దారెడ్డి, వై.నర్సింహులు, పి.శివప్రసాద్, ఆంజనేయులు, నాగరాజు, సుధీర్, రాజ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ డిజిటల్ కార్డుతో బహుళ ప్రయోజనాలు


రాఘవరాపురంలో సర్వేను పర్యవేక్షిస్తున్న రోహిత్‌సింగ్

పాలకుర్తి, అక్టోబరు 3 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డులో భాగంగా మండలంలోని రాఘవాపురం, చీమల భాయి తండా గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి డిజిటల్ సర్వేకు ప్రజలు సహకరించాలని జనగామ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రాఘవాపు రం, చీమలభాయి తండాల్లో చేపడుతున్న డీజిటల్ సర్వేను రోహిత్‌సింగ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవాపురం గ్రామంలో మొత్తం 182 కుటుంబాలు ఉన్నాయని 78 కుటుంబాల సర్వే చేసిన్లు తెలిపారు. చీమలభాయి తండాలో 158 కుటుంబాలు ఉండగా 62 కుటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈ డిజిటల్ కారు బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడేవిధంగా ప్రభుత్వం కార్డును జారీ చేస్తుందన్నారు. అంతకు ముందు స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీ.ఎస్. వెంకన్న, డీఆర్‌డీవో పీడీ వసంత, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఆర్‌ఐ రాకేష్, పంచాయతీ కార్యదర్శులు యుగేందర్, చంద్రశేఖర్, ప్రియాంక మహేందర్ ఉన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే కడియం

జనగామ రూరల్, అక్టోబరు 3: మండలంలోని పెంబర్తిలో గల (స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన) మహాత్మా జ్యోతిరావు పూలే మహిళా డిగ్రీ కళాశాలను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల నిర్వహణకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సదుపాయాలు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. వీలైనంత త్వరలో కళాశాలను స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించేందుకు భవనాలను గుర్తించాలని కోరారు. కళాశాల మార్పుకు అవస రమైన ఏర్పాట్లను త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్‌కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సోమనర్సయ్య


సోమనర్సయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

పాలకుర్తి, అక్టోబరు 3 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జీడి సోమనర్సయ్య గొప్ప నాయకుడని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జిల్లా నాయకుడు చిట్యాల సోమన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని చెరువు బండల వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా సోమనర్సయ్య స్మారక స్థూపానికి ఆయన కుఠుంబ సభ్యులతో కలిసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగయ్య, చాకలి ఐలమ్మ మనుమరాలు సంధ్యారాణి, సోమనర్సయ్య కుమా రుడు జీడి రవి, సోమేశ్వర్, మనవడు హరీష్, కట్ల నర్సింహులు, షేరు అశోక్, ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి


కడియం శ్రీహరితో తమ్మడపల్లి(ఐ) గ్రామ మహిళలు

జఫర్‌గడ్, అక్టోబరు 3 : మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(ఐ) గ్రామ మహిళలు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. తమ్మడపల్లి(ఐ) మాజీ సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్ నేతృత్వంలో గ్రామానికి చెందిన మహిళలు, సంఘాల ప్రతినిధులంతా కలిసి గురువారం హన్మకొండలోని ఎమ్మెల్యే నివాసంలో శ్రీహరిని కలిశారు. ఇందుకు ఎమ్మెల్యే కడియం సానుకూలంగా స్పందించి బస్సు సౌకర్యంతో పాటు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని మాజీ సర్పంచ్ అనిత సుధాకర్ తెలిపారు.

కేటీఆర్ ఫెక్సీ దహనం

జనగామ రూరల్, అక్టోబరు 3: కేటీఆర్ మంత్రులు కొండా సురేఖ, సీతక్కలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా వద్ద కేటీఆర్ ఫ్లెక్సీని చెప్పులతో కొట్టి దహనం చేశారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరా మాట్లాడుతూ కేటీఆర్ మహిళా మంత్రులు అన్ని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. కార్యక్రమంలో కావ్య శ్రీ, చెంచారపు బుచ్చిరెడ్డి, లింగాల నర్సిరెడ్డి, బనుక శివరాజ్, జక్కుల అనిత, కాముని జయ, మున్నీబేగం, రాంచంద్రం పాల్గొన్నారు.


కేటీఆర్ ఫ్లెక్సీ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పరిశీలించిన కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, అక్టోబరు 3: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ హైస్కూల్లో జరుగుతుండగా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియకు సంబంధించి అర్హత సాధించిన అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన పక్కాగా చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా క్వాలిఫై అయిన అభ్యర్థులతో కలెక్టర్ మాట్లాడారు. కౌంటర్లను పరిశీలిస్తూ తగు సూచనలు ఇచ్చారు. ధ్రువపత్రాల పరిశీలన కొరకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారి కె.రామును అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఏ లకు రెండు కౌంటర్లు, ఎస్‌జీటీ లకు ఒకటి, తెలుగు, హిందీ పండిట్లకు ఒకటి, పీఈటీ లకు ఒక కౌంటర్‌తో మొత్తం 6 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు. మొత్తం 514 మంది అభ్యర్థులకు గాను 422 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని, మిగతా వారు ఈ నెల 4న హాజరు కావాలని డీఈవో కోరారు. ఉమ్మడి జిల్లా పరిశీలకులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేయాలని వినతి


హద్దుల ఏర్పాటుపై డీఈఈతో మాట్లాడుతున్న ప్లాట్ల యజమానులు

లింగాలఘణపురం, అక్టోబరు3: మండలంలోని నెల్లుట్ల పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను వెంటనే నిర్ధారణ చేయాలని స్థానికులు, ఇళ్ల ప్లాట్ల యజమానులు గురువారం అధికారులకు విజ్ఞప్తి చేశారు. గతంలో మే మాసంలో ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై అధికారులు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి ఇప్పటి వరకు హద్దులు ఏర్పాటు చేయకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఇళ్ల ప్లాట్ల యజమానులు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో గురువారం ఇరిగేషన్ శాఖ డీఈఈ రవీందర్ నేతృత్వంలో ఏఈలు లక్ష్మణ్, పూర్ణచందర్‌లు నెల్లుట్ల చెరువును సందర్శించగా ప్లాట్ల యజమానులు అధికారులను మరోసారి నిలదీశారు. ఎఫ్‌టీఎల్ హద్దుల ఏర్పాటు విషయంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో స్పందించిన అధికారులు ప్రస్తుతం పిచ్చిమొక్కలు, కంపచెట్లు విపరీతంగా ఉండటం వల్ల ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు ఆటంకం ఏర్పడుతుందని వారం రోజుల్లో ఫుల్‌ట్యాంక్ లెవల్ హద్దులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని నిరసన


రోడ్డు పైన నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 3: గత ఆరు నెలలుగా గ్రామంలో తరుచుగా విద్యుత్ సమస్యలు తలెత్తి ఇబ్బందులు పడుతున్నామని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పాంనూర్ గ్రామంలో గ్రామస్తులు ఘన్‌పూర్-ఐనవోలు రోడ్డుపైన నిరసన వ్యక్తం చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం గ్రామానికి శివునిపల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా వచ్చేదన్నారు. ఆరు నెలలుగా విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరాను శివునిపల్లి నుంచి తొలగించి ఉప్పుగల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారన్నారు. ఉప్పుగల్లు నుంచి సరఫరా ప్రారంభమైనప్పటి నుంచి ఎప్పటికి విద్యుత్ సమస్యలు వస్తున్నాయన్నారు. బుధవారం సాయంత్రం కరెంట్ సరఫరా నిలిచిపోయి గురువారం తెల్లవారుజామున వరకు రాకపోవడంతో గ్రామస్తులు ఉక్కపోత, దోమల స్వైరవిహారంతో జాగారం చేయాల్సి వచ్చిందన్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి విద్యుత్ సమస్యలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ఒగ్గు రాజు, పొన్న బీరయ్య, చాడ వెంకటశివా రెడ్డి, ఎమ్డీ అన్వర్‌పాషా, పొగాకు కుమా రస్వామి, బత్తిని శ్రీనివాస్, కడారి రమేష్, తాళ్లపల్లి వేణుకుమార్, సాంబరాజు, కోతి దశరథం, తాళ్లపల్లి రాజు, మల్లేషం, యాకయ్య పాల్గొన్నారు. కాగా విద్యుత్ ఏడీఈ వంశీకృష్ణ పాంనూర్ వచ్చి పరిశీలించారు. బుధవారం వర్షం వల్ల అంతరాయం ఏర్పడిందని రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తానని తెలిపారు.